

# ఆపద్బాంధవులు

- ఒక్కడితో మొదలై 262 మందికి చేరిన రక్తదాతలు
- ఒక్క ఫోన్‌కాల్ తో క్షణాల్లో బాధితుల చెంతకు..
- ఇప్పటికే 1,100 మందికి పైగా రక్తదానం
- రక్తగ్రహీతలకు కొండంత ధైర్యం..
  'భగత్‌సింగ్ బ్లడ్ డొనేషన్ ఆర్గనైజింగ్ గ్రూప్'






రక్తదానం చేసినందుకు పాల సంతోష్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు



సారపాక, డిసెంబర్ 14:'అన్ని దానాల్లో కెల్లా రక్తదానం మిన్న..' అన్నారు పెద్దలు. అందుకే ఎవరైనా ప్రమాదానికి గురైతే వారికి సకాలంలో రక్తం అందించడం అత్యవసరం. ఇలా సకాలంలో రక్తం అందక రోజూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. అలాంటి వారిలో కొంతమందికైనా తాము రక్తాన్ని అందించి వారి ప్రాణాలు కాపాడడంతో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. బూర్గంపహాడ్ మండలానికి చెందిన రక్తదాతలు. అందులో ముఖ్యుడే పాల సంతోశ్‌రెడ్డి. బూర్గంపహాడ్ మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన పాల సంతోశ్‌రెడ్డి ఐటీసీ కాంట్రాక్టు కార్మికుడు. 2016లో తన సోదరికి రక్తం అవసరమైన సమయంలో ఆ బ్లడ్ గ్రూప్ లభించలేదు. అందు కోసం ఎంతో శ్రమపడాల్సి, వేలాది రూపాయలు వెచ్చించాల్సి వచ్చింది. ఆ ఆపద నుంచి సంతోశ్‌కు ఓ ఆలోచన వచ్చింది. ఇలా ఆసుపత్రుల్లో రక్తం కోసం అత్యవసర సమయాల్లో ఎదురుచూసే వారికి చేయూతగా నిలవాలని నిర్ణయించుకున్నాడు. తనతోపాటు తన టెన్త్‌క్లాస్ మిత్రులైన 42 మందితో కలిసి 'భగత్‌సింగ్ బ్లడ్ డొనేషన్ ఆర్గనైజింగ్ గ్రూపు'ను ఏర్పాటు చేశాడు. దాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేందుకు సోషల్ మీడియాను వేదికగా చేసుకున్నారు. అప్పటి నుంచి ఎవరికి రక్తం అవసరమైనా ఒక్క ఫోన్ కాల్‌తో బాధితుల వద్దకు వెళ్లి రక్తదానం చేయడం ప్రారంభించాడు. ఎందరికో రక్తదాతగా మారారు. ఈ సేవా కార్యక్రమాలకు ఎంతోమంది యువకులు ఆకర్షితులయ్యారు. చాలా మంది ఆ ఆర్గనైజేషన్‌లో చేరారు. ఇప్పటి వరకూ ఈ గ్రూపులో 220 మంది చేరగా మొత్తం సభ్యుల సంఖ్య 262కు చేరింది. వీరు బాధితుల వద్దకు వెళ్లి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్నారు. మొత్తం ఇప్పటివరకు గ్రూపు సభ్యులు 1,100 మందికి పైగా రక్తం అందించి వారిని ప్రాణాపాయం నుంచి కాపాడారు. తాము ఎన్నికష్టాలు పడినా ఓ ప్రాణాన్ని కాపాడితే తమకు అదే సంతోషమంటూ నిర్ణయించుకున్న ఆ గ్రూపు సభ్యులు నిరంతరం తమ బాధ్యత నెరవేర్చుతూ సమాజానికి చేయూత అందిస్తూ ముందుకు సాగుతున్నారు.



ఐటీసీ అడ్మిన్ మేనేజర్ నుంచి అవార్డు అందుకుంటున్న పాల సంతోశ్‌రెడ్డి



### రక్తం కోసం ఎవరూ ఇబ్బంది పడకూడదు..



ఆపదలో రక్తం అవసరమై నాలాగా ఎవరూ ఇబ్బంది పడకూడదనేదే మా ఉద్దేశం. అందుకే ఎవరి నుంచీ ఏమీ ఆశించకుండా మేమే స్వచ్ఛందంగా బాధితుల వద్దకు వెళ్లి రక్తం అందిస్తున్నాం. మా గ్రూపులో ఇప్పుడు 262 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాలో ఎవరికి రక్తం అవసరమైనా మా గ్రూపు సభ్యులకు ఒక్క ఫోన్ చేస్తే చాలు.. వెంటనే బాధితుల వద్దకు వెళ్లి స్వచ్ఛందంగా రక్తదానం చేసి వారిని కాపాడుతున్నాం. అదే మాకు నిజమైన సంతృప్తి. రక్తం అవసరమైన ఎవరైనా, ఏ సమయంలోనైనా '7659892212' నంబర్‌కు ఫోన్ చేయొచ్చు.

**–పాల సంతోశ్‌రెడ్డి, రక్తదాత, భగత్‌సింగ్ బ్లడ్ డొనేషన్ ఆర్గనైజింగ్ గ్రూపు నిర్వాహకుడు**

### ప్రముఖుల అభినందనలు..

ఫౌండర్ పాల సంతోశ్‌రెడ్డి ఇప్పటివరకు 25 సార్లు రక్తదానం చేశాడు. అతడు, అతడి గ్రూపు సభ్యులు కలిసి 1100 మందికి పైగా రక్తం అందించారు. వీరి సేవలను గుర్తించిన 'ఆట' సంస్థ బాధ్యులు 2018లో జరిగిన ఆ సంస్థ వేడుకల్లో సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ చేతులమీదుగా ఆట పుష్కర అవార్డును ప్రదానం చేశారు. ఆ తర్వాత 2021 ఐటీసీ పీఎస్‌పీడీ అడ్మిన్ మేనేజర్ చెంగల్‌రావు నుంచి కూడా అవార్డు అందుకున్నారు. 2023లో ఆ గ్రూపు సభ్యులు 1,000 మందికి రక్తదానం చేసిన సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు కూడా సంతోశ్, అతడి మిత్రులను సత్కరించారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

# అంబరాన్నంటిన నవభారత్ క్రీడా సంబురం



బెలూన్లను గాలిలో ఎగురవేస్తున్న కలెక్టర్

## ప్రారంభించిన కలెక్టర్ ప్రియాంక ఆల

పాల్వంచ, డిసెంబర్ 14 : పాల్వంచ పట్టణ పరిధిలోని నవభారత్ పబ్లిక్ పాఠశాల 44వ వార్షిక క్రీడా దినోత్సవ సంబురాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, విశిష్టఅతిథిగా ఈ.నరేశ్(ఖోఖో కోచ్ ఇండియన్ రైల్వే టీం), నవ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వీ శరత్‌బాబు, డీజీఎం నవలిమిటెడ్ శంకరయ్య హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాసరెడ్డి వారికి స్వాగతం పలికారు. సీబీఎస్ఈ క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ సిల్వర్ మెడలిస్టు బి.కీర్తిశ్రీ రాథోడ్ క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం విద్యార్థులకు అథ్లెటిక్స్ ట్రాక్స్‌పై 15 క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించారు. పాఠశాల వ్యాయామ శిక్షకులు ఎన్‌వీ లక్ష్మీ వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో అవధులు లేని అందమైన సమాజానికి దోహదపడే ఆయుధాలు అని అన్నారు. క్రమశిక్షణ, విధేయత విద్యార్థుల ఉన్నతదశకు దోహదపడతాయని, ఆ రీతిగా విద్యార్థులను తయారుచేస్తున్న నవభారత్ యాజమాన్యాన్ని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

# కొత్త ఓటుకో అవకాశం..

- 20వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జనవరి ఒకటో తేదీ వరకు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు అర్హులు
- సవరణలు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు
- ఫిబ్రవరి 8న తుది ఓటర్ల జాబితా విడుదల




అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ)/సారపాక : కేంద్ర ఎన్నికల సంఘం కొత్త ఓటర్లకు మరోసారి అవకాశం కల్పించింది. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు పూర్తి కావడం.. వచ్చే పార్లమెంట్, గ్రామ పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో జనవరి 1, 2024 వరకు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటరుగా నమోదు చేసుకోవడానికి వీలు కల్పించింది. అర్హత ఉన్న వారు ఆన్‌లైన్ లేదా ఆఫ్ లైన్ లేదా బీఎల్వోలకు ఫామ్–6 సమర్పించి నూతన ఓటరు జాబితాలో పేరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతోపాటు చిరునామా తప్పుగా ఉన్న వారు కూడా సవరణకు దరఖాస్తు ఇవ్వవచ్చని పేర్కొన్నది. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024 పేర ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఎన్నికల్లో తమకు ఓటు లేదు.. మిస్ అయింది.. అనే మాట రాకుండా ఎన్నికల సంఘం ముందస్తు చర్యల్లో భాగంగా ఈ వెసులుబాటు కల్పించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సైతం కొత్త ఓటర్లను చేర్పించడంలో ఎన్నికల అధికారులు పకడ్బందీ ప్రణాళికతో సక్సెస్ అయ్యారు. యువతకు కొత్త ఓటర్లుగా అవకాశం కల్పించడంతోపాటు పాత ఓటర్ల చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించి జిల్లావ్యాప్తంగా ఓటర్ల సంఖ్యను పెంచగలిగారు.

### ఫిబ్రవరి 8న తుది జాబితా..

కొత్తగా ఓటర్లను చేర్చుకునే ప్రక్రియకు ఈ నెల 20వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టనున్నది. దీంతోపాటు సవరణలకు కూడా వెసులుబాటు కల్పించారు. బూత్ లెవల్ అధికారులు ఇంటి వద్దకు వచ్చి కొత్త ఓటర్ల వద్ద దరఖాస్తులు స్వీకరిస్తారు. చేర్పులు, మార్పులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ ప్రక్రియ జనవరి 5వ తేదీ వరకు కొనసాగుతుంది. 6న ముసాయిదా ప్రకటించి అభ్యంతరాలను స్వీకరిస్తారు. తుది జాబితాను ఫిబ్రవరి 8న అధికారికంగా ప్రకటించనున్నారు. ఇందుకోసం కలెక్టర్ ప్రియాంక ఆల ప్రకటన కూడా చేశారు. కొత్తగా ఓటర్లుగా చేరేవారు జనవరి 1 తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారిని అర్హులుగా గుర్తిస్తారు.


**అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా ఓటు హక్కు వినియోగించుకున్న వారి వివరాలిలా..**

| నియోజకవర్గం | మొత్తం ఓటు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| పినపాక | 1,98,402 | 1,58,978 | 80.13 |
| ఇల్లెందు | 2,19,569 | 1,76,840 | 80.54 |
| కొత్తగూడెం | 2,43,846 | 1,86,347 | 76.42 |
| అశ్వారావుపేట | 1,55,961 | 1,35,501 | 86.88 |
| భద్రాచలం | 1,48,661 | 1,17,447 | 79.00 |

### అవగాహన కల్పించనున్న అధికారులు



కొత్త ఓటర్ల నమోదుకు గతంలో మాదిరిగానే ప్రభుత్వ కళాశాలలు, ప్రధాన కూడళ్ల వద్ద అధికారులు విస్తృతంగా ప్రచారం చేయించనున్నారు. ఓటు విలువ గురించి సాంస్కృతిక సారథులు పాటలు, మాటల ద్వారా తెలియపరచనున్నారు. ముఖ్యంగా కళాశాలల విద్యార్థినీ విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించనున్నారు.అయితే ఎన్నికల సంఘం ఓటు హక్కు వినియోగంపై ఎంత ప్రచారం చేసినా పోలింగ్ అన్ని నియోజకవర్గాల్లో 20 శాతం తక్కువగానే అవుతున్నది. 90 శాతం వరకు పోలింగ్ జరగాలంటే మరింత ప్రచారం అవసరమని పలువురు భావిస్తున్నారు. యువతకు ఓటు హక్కుపై అవగాహన పెరిగినా మధ్య వయస్సు వాళ్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం లేదని తెలుస్తోంది.



### ఓటరుగా నమోదు చేసుకోవాలి



శాసనసభ ఎన్నికల తర్వాత జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్త ఓటరుగా చేరే అవకాశం ఉన్నది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి అవకాశం కల్పించింది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఓటు హక్కును వినియోగించుకోవాలి.

**– ప్రియాంక ఆల, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్**

# కూర్మావతారంలో రాములోరు..

- వైభవంగా సాగుతున్న ఏకాదశి అధ్యయనోత్సవాలు
- స్వామివారిని చూసి మురిసిపోయిన భక్తజనం
- నేడు వరాహావతారంలో దర్శనమివ్వనున్న రామయ్య



కూర్మావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న కోదండ రాముడు





భద్రాచలం, డిసెంబర్ 14 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దివ్యక్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం రెండో రోజు భద్రాద్రి రామయ్య కూర్మావతారంలో భక్తులకు దర్శనమివ్వగా.. స్వామివారిని చూసి మురిసిపోయారు. ఉదయం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను, ఉత్సవ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసిన తర్వాత స్వామివారికి వేద విన్నపాలు చేశారు. అనంతరం స్వామివారిని అంతరాలయంలోకి తీసుకెళ్లి కూర్మావతారంలో అలంకరించి బేడా మండపానికి తీసుకొచ్చి అర్చనలు చేశారు. నాలాయిర దివ్య ప్రబంధంలోని 200 పాశురాలు, వేద పారాయణం పఠించారు. తర్వాత స్వామివారికి రాజభోగం సమర్పించారు. బేడా మండపంలో స్వామివారిని భక్తుల దర్శనార్థం ఉంచి మధ్యాహ్నం 2 గంటలకు సమస్త మంగళవాయిద్యాలు, వేద పండితుల వేద ఘోషలతో, కోలాట నృత్యాలతో గోదావరి తీరానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మిథిలా స్టేడియానికి తీసుకొచ్చి హారతులు సమర్పించి.. అర్చనలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కూర్మావతారంలో ఉన్న స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం 4.30 గంటలకు స్వామివారిని తిరువీధి సేవలో భాగంగా విశ్రాంత మండపానికి తీసుకొచ్చి ప్రత్యేక వేదికపై కొంతసేపు ఉంచారు. అనంతరం తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ నిర్వహించారు. పల్లకిలో వస్తున్న స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు రహదారులకిరువైపులా కిక్కిరిసిపోయారు. తమ ఆరాధ్య దైవానికి హారతులు, వివిధ రకాల ఫలాలు సమర్పించి పరవశించిపోయారు. అవతార విశిష్టతను ఆస్థాన స్థానాచార్యులు కేఈ స్థలశాయి భక్తులకు వివరించారు. మిథిలా ప్రాంగణంలో నిర్వహిస్తున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు పట్టణవాసులను, భక్తులను అలరించాయి. సాయంత్రం 6 గంటలకు పట్టణానికి చెందిన లాస్యప్రియ చేసిన కూచిపూడి నృత్యం, హైదరాబాద్‌కు చెందిన శర్వాణి, కార్తీక చేసిన కూచిపూడి నాట్య ప్రదర్శనను భక్తులు తిలకించారు. రాత్రి 9 గంటలకు ప్రదర్శించిన శ్రీవరలక్ష్మీ నాట్య మండలి, తెనాలి వారిచే ప్రదర్శించిన గయో పాఖ్యానం నాటక ప్రదర్శన ఎంతగానో మెప్పించాయి.

### నేడు వరాహావతారం

భద్రాద్రి రామయ్య శుక్రవారం వరాహావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రజా సృష్టి చేద్దామనుకున్న స్వయంభువుని.. బ్రహ్మాదుల మొర విన్న శ్రీమన్నారాయణుడు నీటిలో మునిగి ఉన్న భూమిని పైకి తీయడానికి వరాహావతారాన్ని ధరించి.. భూమిని తన కోరలతో పైకెత్తాడు. ఈ క్రమంలో ఆటంకం కలిగించిన లోకకంటు అయిన హిరణ్యాక్షుడు అనే దానవుడిని సంహరించి భూమిని రక్షించాడు. రాహు, గ్రహ బాధలున్నవారు ఈ అవతారాన్ని దర్శిస్తే ఆ బాధల నుంచి విముక్తులవుతారని ప్రశస్తి.